కృష్ణ.. ష్ణ! (కృ ష్ణ ష్ణా!)

కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. రాష్ట్రంలోని 91 ఫార్మసీ కళాశాలలకు 2025-26 విద్యా సంవత్సరంలో అనుమతి పొడిగిస్తూ ఈ నెల 12వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ జాబితాలో కృష్ణాయూనివర్సిటీలో నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాల పేరు లేదు. దీంతో గత ఐదు సంవత్సరాలుగా నడుస్తున్న బీ-ఫార్మసీ కళాశాల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ ఏడాది అడ్మిషన్లపై అయోమయం నెలకొంది.

- ఆ జాబితాలో దక్కని స్థానం
- ఈ ఏడాది అడ్మిషన్లపై అయోమయం!
- గతంలో ఫార్మసీ విభాగంలోని పీజీ కోర్సు రద్దు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



కృష్ణా యూనివర్సిటీలోని బీ-ఫార్మసీ కళాశాలకు లభించని గుర్తింపు

తాజాగా రాష్ట్రంలోని 91 ఫార్మసీ కళాశాలలకు గుర్తింపును పొడిగిస్తూ ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీలో 2020లో బీ-ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఫార్మసీ కళాశాల భవన నిర్మాణాన్ని కూడా ప్రారంభించారు. ఒక ఏడాది 100 సీట్లు, అనంతరం 60 సీట్ల చొప్పున బీ-ఫార్మసీ కోర్సులో చేరేందుకు అనుమతులు కూడా ఇచ్చారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లు కోర్సును పూర్తి చేసుకుని వెళ్లిపోయాయి. ఈ నెల 12వ తేదీన ఉన్నత విద్యామండలి రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలలకు 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్‌ల కోసం అనుమతులు ఇస్తూ జీవోఆర్‌టీ నెంబరు 144ను జారీ చేసింది. ఆయా కళాశాలల్లో ఎన్ని సీట్లు భర్తీ చేయాలనే అంశంపై స్పష్టత ఇచ్చింది. కానీ కృష్ణాయూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న బీ-ఫార్మసీ కళాశాల పేరు ఈ జాబితాలో లేదు. దీంతో ఈ ఏడాది ఫార్మసీ కోర్సులో అడ్మిషన్‌లు ఉంటాయా.. ఉంటే సంబంధిత కోర్సు చదివిన విద్యార్థినీ, విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లు పైకోర్సులు చదివేందుకు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనే అంశంపై అయోమయం నెలకొంది. 2020 నుంచి ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా కృష్ణాయూనివర్సిటీలో ఫార్మసీ కోర్సులలో సీట్లను భర్తీ చేస్తూ వస్తున్నారు.

సరైన అధ్యాపకులు లేకపోవడం వల్లేనా!

వర్సిటీలో బీ-ఫార్మసీ కోర్సుకు మంచి డిమాండ్ ఉంది. అన్ని సీట్లు భర్తీ అవుతున్నాయి. కానీ ఈ కళాశాలలో సరైన విద్యార్హతలు ఉన్న అధ్యాపకులను నియమించకపోవడం వల్లే ప్రభుత్వం ఈ ఏడాది అనుమతులు ఇవ్వలేదనే వాదన వినపడుతోంది. వర్సిటీలోని బీ-ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పోస్టును గతంలో పని చేసిన వీసీ ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి నియమించారని స్థానిక అధ్యాపకులు చెబుతున్నారు. సదరు ప్రిన్సిపాల్ విద్యార్హతలను

మిగతా 6లో..

జిల్లాలో రెండు కళాశాలలకు అనుమతి



కృష్ణా యూనివర్సిటీ పరిధిలో విజయవాడలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్‌లో బీ-ఫార్మసీ కోర్సులో 100 సీట్లు, ఫార్మా-డి కోర్సులో 30 సీట్లు భర్తీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నూజివీడులోని శ్రీసిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో బీ-ఫార్మసీ కోర్సులో 100 సీట్లు భర్తీ చేసేందుకు అనుమతులు వచ్చాయి. కానీ కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలోని బీ-ఫార్మసీ కళాశాలకు అనుమతులు ఇవ్వకపోవడం గమనార్హం. కృష్ణా యూనివర్సిటీ పరిధిలోని ఫార్మసీ కళాశాలలకు అనుమతులు ఇవ్వగా, కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలోని ఫార్మసీ కళాశాలకు అనుమతులు ఇవ్వకపోవడం, ఎన్ని సీట్లలో ఈ ఏడాది ఈ కోర్సులో విద్యార్థులను చేర్చుకోవాలో ఉత్తర్వులలో పేర్కొనక పోవడం విశేషం. ఈ అంశంపై యూనివర్సిటీ అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి. గతంలో కృష్ణాయూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో పీజీ కోర్సు ఉండేది. ఈ కోర్సును వివిధ కారణాలతో రద్దు చేశారు. పీజీ కోర్సు మాదిరిగానే బీ-ఫార్మసీ డిగ్రీ కోర్సును కూడా వదిలేస్తారా లేక యూనివర్సిటీ అధికారులు అనుమతులు తీసుకువస్తారా అనే అంశంపైన చర్చ జరుగుతోంది.

బార్‌లు @ 183



ఎన్టీఆర్ జిల్లాలో 140... కృష్ణాజిల్లాలో 43 ఏర్పాటు

గీత కార్మికులకు 14 బార్‌ల కేటాయింపు

- 20న గెజిట్ నోటిఫికేషన్ విడుదల
- గీత కార్మికుల దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు 29
- ఓపెన్ కేటగిరి బార్ దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు 26



(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయబోయే బార్‌ల లెక్కను ఎక్సైజ్ అధికారులు తేల్చారు. ప్రస్తుతం ఉన్న బార్‌ల లైసెన్స్ గడువు ఈనెలాఖరుతో ముగియడంతో కొత్త విధానం ప్రకారం బార్‌లకు అనుమతులు ఇవ్వబోతున్నారు. ఓపెన్ కేటగిరి, గీత కార్మికులకు కేటాయించిన బార్‌లు మొత్తం 183 ఏర్పాటు కాబోతున్నాయి. ఇందులో ఎన్టీఆర్ జిల్లాలో 140, కృష్ణాజిల్లాలో 43 బార్‌లు రాబోతున్నాయి. వాటిలో గీత కార్మికులకు 14 బార్‌లను కేటాయించారు. ఎన్టీఆర్ జిల్లా పది,

మిగతా 6లో..

దరఖాస్తులు ఇలా..

బార్‌ల లైసెన్స్‌లను పొందాలనుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. దీంతోపాటు విజయవాడ, మచిలీపట్నంలోని ఈఎస్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. అదే రోజున జిల్లా ఎక్సైజ్ అధికారులు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఓపెన్ కేటగిరీలో బార్‌లకు దరఖాస్తులు చేసుకునే వారికి 26వ తేదీ సాయంత్ర ఐదు గంటలకు తుది గడువు. ఆ బార్‌లకు 28వ తేదీన లాటరీ తీస్తారు. గీత కార్మికుల కోటాలో దరఖాస్తులు చేసుకునే వారికి 29వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు తుది గడువు. 30వ తేదీన లాటరీ ద్వారా బార్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తుగా రూ.10వేలు, డిపాజిట్‌గా రూ.5లక్షలు చెల్లించాలి. ఇందులో రూ.5లక్షలకు వాపసు ఉండదని అధికారులు తెలిపారు.

కృష్ణానదికి వరద పోటు

లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుందని అంచనా

- 20వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి భారీ వర్షాలు
- అప్రమత్తమైన అధికారులు



మచిలీపట్నం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద పోటు పొంచి ఉంది. సోమవారం ఉదయం ఆల్మట్టి, నారాయణపూర్, శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టుల నుంచి ప్రకాశం బ్యారేజీకి పెద్దఎత్తున వరద నీరు చేరే అవకాశం ఉందని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ నెల 20వ తేదీ నాటికి పులిచింతల ప్రాజెక్టు నుంచి ఆరు లక్షల నుంచి 6.30 లక్షల క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీకి విడుదల చేసే అవకాశం ఉంది. ప్రకాశం బ్యారేజీ ఎగువన ఉన్న వాగులు, ఉపనదుల ద్వారా వచ్చే వరద నీరు, పులిచింతల ప్రాజెక్టు నుంచి విడుదల చేసే వరదనీటితో కలుపుకుని ఏడు లక్షల నుంచి ఎనిమిది లక్షల క్యూసెక్కుల నీటిని ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి విడుదల చేసే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో కురిసే వర్షపాతాన్ని ఆధారంగా చేసుకుని నీటి విడుదలలో కొద్దిపాటి మార్పులు ఉంటాయని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కాగా, రానున్న మూడు రోజులపాటు కోస్తా తీరం వెంబడి భారీ నుంచి అతి భారీ వర్షాలకు కురుస్తాయని వాతావరణశాఖ ఆదివారం హెచ్చరికలు జారీ చేసింది. ఉదయం నుంచి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి.

అప్రమత్తంగా ఉండండి: ఇన్‌చార్జి కలెక్టర్

భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలు, కృష్ణానదికి వరద అధికంగా వచ్చి చేరుతుందనే సమాచారంతో ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ ఆదివారం రాత్రి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం నాటికి ప్రకాశం బ్యారేజీకి 3.97 లక్షల క్యూసెక్కుల వరదనీరు వస్తుందని, ఈ నీటిని సముద్రంలోకి వదులుతారని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నాటికి ప్రకాశం బ్యారేజీ వద్దకు వరదనీరు ఏడు లక్షల క్యూసెక్కులకుపైగా పెరుగుతుందనేది అంచనాగా ఉందన్నారు. ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతాల్లో అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లంక గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

బుడమేరు.. అదే తీరు!



భారీ యంత్రంతో బుడమేరులో పూడికతీత

కాలువలో గుర్రపు డెక్క తొలగించని ఇరిగేషన్‌శాఖ

- ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం మానని స్థానికులు
- బుడమేరులో ముందుకు కదలని ప్రవాహం
- సమస్యపై స్పందించిన ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ
- కార్పొరేషన్ కమిషనర్‌కు బాధ్యతల అప్పగింత
- డ్రోన్ క్యాప్చరింగ్ చేయించిన కమిషనర్ ధ్యానచంద్ర
- రామవరప్పాడులో ఎస్ఎల్‌వీ దగ్గర భారీగా గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు
- భారీ యంత్రాలతో తొలగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మానవ, ప్రభుత్వ శాఖల తప్పిదాలు బుడమేరుకు శాపంగా మారుతున్నాయి. వర్షాకాలం వస్తుందని తెలిసి కూడా బుడమేరులో కనీసం తూటికాడ కూడా తొలగించటానికి ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు చేపట్టలేదు. ఫలితంగా విజయవాడ నగరం, శివారు ప్రాంతాలలో కురిసిన వర్షానికే నగర పరిధిలో బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీనికి కారణం.. గుర్రపు డెక్క తొలగించకపోవటమే. గుర్రపుడెక్క బుడమేరు ప్రవాహానికి అడ్డు పడుతోంది. దీంతో బుడమేరులో వరద కదలక నిండుకుండలా మారిపోతోంది. గుర్రపు డెక్కతో పాటు నగర ప్రజల తప్పిదం వల్ల కూడా బుడమేరు ప్రవాహం దిగువకు పారటానికి ఇబ్బంది తలెత్తుతోంది. గతేడాది ఇదే రోజుల్లో బుడమేరు చూపించిన విలయాన్ని చూసి కూడా నగర ప్రజలు మారడంలేదు. చిరు వ్యాపారులు, స్థానికులు ఇష్టానుసారం ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర పాలిథీన్ చెత్తను బుడమేరులో పడవేయటం వల్ల అవి కూడా ఇప్పుడు బుడమేరు ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. మానవ తప్పిదాలు, ఇరిగేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా చిన్న వర్షాలకే ఇబ్బంది పడాల్సి వస్తోంది.

క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య గుర్తించిన కలెక్టర్

బుడమేరు నిండుగా ప్రవహిస్తుండటం చూసి పైనుంచి వరద వస్తుందేమోనని సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రజలు భయపడిపోతున్నారు. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ బుడమేరును ప్రతి రోజూ పరిశీలిస్తున్నారు. బుడమేరు ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని గుర్తించిన ఆయన ఈ బాధ్యతలను విజయవాడ మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్రకు అప్పగించారు. మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగంతో సమావేశమై యాక్షన్ ప్లాన్ రూపొందించారు. నగర పరిధిలో బుడమేరు కాలువను డ్రోన్ క్యాప్చరింగ్ చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం సత్ఫలితాలను ఇచ్చింది. బుడమేరు కాలువ ప్రవాహానికి నగర పరిధిలో ఎక్కడెక్కడ ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయో గుర్తించటం జరిగింది. డ్రోన్ క్యాప్చరింగ్ ద్వారా రామవరప్పాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్ఎల్‌వీ గ్రాండ్ దగ్గర గుర్రపుడెక్క, వ్యర్థాలు పేరుకుపోవటాన్ని గుర్తించారు. చాలా పెద్ద ఎత్తున వ్యర్థాలు ఇక్కడ పేరుకుపోయి ప్రవాహానికి

మిగతా 6లో..

పట్టాభి స్మారక భవనానికి గ్రీన్‌సిగ్నల్!



వల్లభనేని బాలశౌరి

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి సమస్య తీసుకెళ్లిన ఎంపీ బాలశౌరి

- యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులతో మాట్లాడిన కేంద్ర మంత్రి
- మూడు విడతలుగా నిధులు మంజూరుకు ఆమోదం
- బాలశౌరి కృషిని అభినందించిన పట్టాభి భవన స్మారక ఉద్యమకారులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి చొరవతో ఎట్టకేలకు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. పట్టాభి సీతారామయ్య భవనానికి గత వైసీపీ ప్రభుత్వం రెండెకరాల భూమిని కేటాయించింది. యూనియన్ బ్యాంకు అప్పట్లో రూ.40 కోట్లు మంజూరు చేసింది. అయితే మునిసిపల్ కౌన్సిల్ అనుమ తులు లేకపోవడం, అప్పటి స్థానిక శాసన సభ్యుడు పేర్ని నాని సహకరించకపోవడంతో నిర్మాణ ప్రక్రియ ముందుకు సాగలేదు. మూడేళ్లుగా దీనిపై పలు ఉద్యమాలు జరిగాయి. పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ దీనిపై హైకోర్టును కూడా ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఈ సమస్యను ఎంపీ వల్లభనేని బాలశౌరి ఢిల్లీలో జరుగుతున్న శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే బ్యాంకింగ్ సెక్రటరీ నాగరాజు, యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ చర్చల ఫలితంగా మూడు విడతల్లో పట్టాభి స్మారక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు యూనియన్ బ్యాంకు ముందుకు వచ్చింది. మొదటి విడతలో రూ.6.50 కోట్లతో కాంపౌండ్ వాల్, మ్యూజియం, నాలెడ్జి పార్కును నిర్మిస్తారు. రెండవ విడతలో ఆడిటోరియం, మూడవ విడతలో యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయ నిర్మాణం జరిపేందుకు యూనియన్ బ్యాంకు అధికారులు అంగీకరించారు. దీంతో పట్టాభి స్మారక భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు, న్యాయవాది

మిగతా 6లో..

పీఎన్‌బీఎస్ కిటకిట



వరుస సెలవులు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం నేపథ్యంలో విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ ఆదివారం కిటకిటలాడింది. వేలాదిగా ప్రయాణికులు రావడంతో బస్టాండ్‌తో పాటు సిటీ బస్ పోర్టు కిక్కిరిసింది. ప్లాట్‌ఫాంపైకి బస్సు వచ్చే వరకు ఆగకుండానే బస్సు ఎక్కేందుకు పోటీ పడటంతో తోపులాటలు జరిగాయి. సాధారణ రోజుల్లో మాదిరిగానే సమయానుకూలంగా ఉన్న బస్సులు చాలకపోవడంతో చిన్నారులు, వృద్ధులతో సహా ప్రయాణికులు ప్లాట్‌ఫాంపైనే పడిగాపులు పడ్డారు. - (ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీ)

6

అట్టహాసంగా గన్నవరం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



గత ఏడాదికి భిన్నంగా.. దుర్గగుడిలో దసరా ఏర్పాట్లు

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన వైద్యబృందం

6



దసరా ఉత్సవాల నమూనా క్యూలను పరిశీలిస్తున్న ఈవో

గత ఏడాదికి భిన్నంగా..

దుర్గగుడిలో దసరా ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు 11 రోజులుపాటు జరగనున్న దసరా ఉత్సవాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల ఆకాంక్షలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. దసరా ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. సీవీ రెడ్డి ఛారిటీస్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన నమూనా క్యూలను పరిశీలించి, కొన్ని మార్పులను సూచించారు. భక్తులకు మరిన్ని సదుపాయాలు కల్పించడానికి గతం కంటే భిన్నంగా, అధునాతనంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఈవో తెలిపారు. ఉత్సవాల్లో రోజుకు 65 వేల నుంచి 80 వేలమంది, మూలానక్షత్రం రోజున 2 నుంచి 3 లక్షల మంది వరకు భక్తులు వస్తారని అంచనా ఉండగా, వన్‌టౌన్ వినాయకుడి గుడి నుంచి కొండపైకి దర్శన క్యూ నిర్మాణంలో మార్పుచేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ బి.రాంబాబు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బీవీ రెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్ల, వీరులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి సత్యనారాయణను సత్కరిస్తున్న బుద్దా వెంకన్న

కోగంటి బాబును కలిసిన బుద్దా వెంకన్న

వన్‌టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కంచకచర్ల, వీరులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోగంటి సత్యనారాయణ (బాబు)ను ఆయన స్వగ్రామం పరిటాలలోని ఆయన నివాసంలో ఆదివారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న కోగంటి బాబును శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు కోగంటి రామారావు, మండలనేతలు పాల్గొన్నారు.



చల్లపల్లిలో హైవే పక్కన మొక్క నాటుతున్న వైద్యబృందం

స్వచ్ఛ చల్లపల్లిని సందర్శించిన వైద్యబృందం

చల్లపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లిని వైద్యుల బృందం సందర్శించింది. గుంటూరు వైద్యకళాశాల 1974 బ్యాచ్ విద్యార్థుల బృందం కుటుంబసభ్యులతో కలిసి చల్లపల్లిని సందర్శించి స్వచ్ఛ కార్యకర్తలతో కాసానగర్ వద్ద హైవే పక్కన మొక్కలు నాటారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్ స్వచ్ఛ ఉద్యమాన్ని పరిశీలించేందుకు 2023లో తొలిసారిగా వైద్యబృందం చల్లపల్లి వచ్చారు. స్ఫూర్తివంతమైన ఉద్యమాన్ని చూసి సంతోషించారు. ఏడాదికోసారి చల్లపల్లి వస్తున్నారు. తాజాగా శనివారం సాయంత్రం చల్లపల్లి వచ్చారు. పద్మాభిరామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో ఉత్సాహంగా గడిపారు. ఆదివారం ఉదయం హైవే పక్కన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, వ్యక్తిగత ప్రయోజనం లేకున్నా గ్రామం కోసం 11 సంవత్సరాలుగా చేస్తున్నసేవలు వెలకట్టలేనివని కొనియాడారు. గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, నల్గొండ, పాలకొల్లు తదితర గ్రామాలకు చెందిన 22 మంది వైద్య ప్రముఖులు ఈ బృందంలో ఉన్నారు.

రాజ్‌భవన్ నుంచి లక్ష్మణస్వామికి ఆహ్వానం



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో పచ్చదనానికి కృషి చేస్తున్న ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాళ్లపల్లి లక్ష్మణస్వామికి అరుదైన గౌరవం లభించింది. ఇప్పటి వరకు 50వేల మొక్కలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి నగరంలో పచ్చని వాతావరణాన్ని ప్రోత్సహిస్తున్న ఆయన సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కార్యాలయం నుంచి లక్ష్మణస్వామిని రాజ్‌భవన్‌కు హాజరుకావాలంటూ ప్రత్యేక ఆహ్వానం పంపింది.



ఇళ్లపైకి జారిపడిన రిటైనింగ్ వాల్

కూలిన రిటైనింగ్ వాల్

» తప్పిన ప్రమాదం.. పెంకుటిల్లు పాక్షికంగా ధ్వంసం

చిట్టినగర్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు ప్రైజర్‌పేట పెద్దిరాజుల వీధిలో ఆదివారం రిటైనింగ్ వాల్ కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వాల్ దిగువున ఉన్న రేకులషెడ్, పెంకుటిల్లుపై పడటంతో అవి పాక్షికంగా ధ్వంసమయ్యాయి. కొండప్రాంతాల్లో ఉంటున్న ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నా పాలకులకు పట్టడంలేదని సీపీఎం ఫ్లోర్‌లీడర్ సత్తిబాబు విమర్శించారు. కూలిన రిటైనింగ్ వాల్స్‌ను వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు ముందస్తుగానే తెలియపరిచినా స్పందించకపోవడం బాధాకరమన్నారు. డివిజన్ కార్యదర్శి జి.బాలదుర్గారావు. ఎన్.గురప్ప, పి.శ్రీను, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎస్‌కు లేఖ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబూరాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు చీఫ్ సెక్రటరీకి లేఖ ద్వారా కోరారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మీడియాతో మాట్లాడారు. 2004 సెప్టెంబరు ముందు నియామకం పొందిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని తక్షణమే వర్తింపచేయాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు.

కొరత సృష్టిస్తే కఠిన చర్యలే

» ఆకస్మిక తనిఖీలను విస్తృతం చేయండి
» ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద కంట్రోల్‌రూం నెంబర్
» నానో ఎరువుల వినియోగంతో అదనపు ప్రయోజనాలు
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో వున్నాయని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని, ఒక్క కిలో కూడా ఎరువులు పక్కదారి పట్టకూడదని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు తప్పవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం వ్యవసాయ, సహకార, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ, టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కొరతకు ఆస్కారం లేకుండా సమృద్ధిగా ఎరువులు వున్నాయని, పక్కదారి పట్టకుండా, ప్రతి రైతుకూ న్యాయబద్ధంగా ఎరువులు పొందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు తీసుకొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల సరఫరాకు సంబంధించి లెక్క పక్కాగా వుండాలని స్పష్టం చేశారు. ఫిజికల్, ఆన్‌లైన్ రికార్డులతో పాటు లావాదేవీలు పారదర్శకంగా ఉండాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 6,388 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ కాంప్లెక్స్ మొత్తం 23,820 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో వున్నట్టు తెలిపారు. నానో ఎరువుల వినియోగంతో బహుళ ప్రయోజనాలున్నాయని, నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిని ఉపయోగించడం వల్ల పంట నాణ్యత, ఉత్పత్తి పెరగడంతో పాటు నేల, గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గించేందుకు వీలుంటుందన్నారు. సంప్రదాయ ఎరువుల కంటే తక్కువ ధరలోనే ఇవి లభ్యమవుతాయని, తేలిగ్గా స్ప్రే చేయొచ్చని వివరించారు. ఎరువుల సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 91549 70454 నెంబరుతో కంట్రోల్ రూం అందుబాటులో వుందని, ఈ నెంబరును ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించడం, ఇతర ప్రయోజనాలకు మళ్లించడం చేస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

వర్షాలు, వరదలపై అప్రమత్తం

వచ్చే మూడురోజుల పాటు భారీ వర్షాలు, వరదలపై అప్రమత్తంగా వుండాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నదికి వెళ్లే మార్గాలు, వాగులు వంకల వద్ద హెచ్చరిక బోర్డులు ప్రదర్శించాలని ఆదేశించారు. నిరంతరం అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్సులో జేసీ ఇలక్కియ, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.మాధురి, కె.బాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వేదాద్రి వద్ద కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

తీర గ్రామాలను అప్రమత్తం చేయండి

» అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం

జగ్గయ్యపేట రూరల్ : కృష్ణానదికి ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం ఉందని, నదీపరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. వేదాద్రి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఘాట్ రోడ్డు వ్యూ పాయింట్ నుంచి కృష్ణానది ప్రవాహాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్పపీడన ద్రోణితో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండుకున్నాయన్నారు. వరద వచ్చే అవకాశం ఉన్నందున నదీపరివాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కృష్ణానదిపాటు పాలేరు, వాగులు, వంకల ద్వారా వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను సురక్షితంగా తరలించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు ప్రమాణపత్రాలు అందజేస్తున్న చలసాని ఆంజనేయులు, పాలకవర్గసభ్యులు

5,465 బంగారు కుటుంబాలకు

మార్గదర్శి కృష్ణామిల్క్ యూనియన్

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పేదరికంలేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అమలుచేస్తున్న పీ-4లో కృష్ణామిల్క్ యూనియన్ 5,465 గ్రామీణ బంగారు కుటుంబాలకు మార్గదర్శనం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చింది. ఈమేరకు యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు నందిగామ మండలం మునగచర్లలో జరిగిన సామూహిక గోకులం కార్యక్రమం సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశకు ప్రమాణ పత్రాలు అందజేశారు. వత్సవాయి నుంచి 1524, పెనుగంచిప్రోలు నుంచి 1192, విస్సన్నపేట నుంచి 1255, విజయవాడ రూరల్ నుంచి 747, చందర్లపాడు నుంచి 747 బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు ఆంజనేయులు ప్రకటించారు. ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసి అవసరమైన చేయూత అందించనున్నట్టు పేర్కొన్నారు. పాడి పశువుల కొనుగోలుకు కేడీసీసీ బ్యాంకు ఇచ్చే రూ.లక్ష రుణాలకు సంబంధించి వడ్డీని యూనియన్ భరిస్తుందన్నారు. పశుగ్రాసంతో పాటు వైద్య సేవలపై యూనియన్ ప్రత్యేక దృష్టిసారిస్తుందని, అవసరం మేరకు సామూహిక గోకులాలు ఏర్పాటుచేసి వాటిని సద్వినియోగం చేసుకొనేలా మహిళా పాడి రైతులను ప్రోత్సహిస్తామన్నారు. బంగారుకుటుంబాల సభ్యులకు అవసరం మేరకు ఆరోగ్య సేవలు అందిస్తామన్నారు. వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేందుకు ముందుకొచ్చిన కృష్ణామిల్క్ యూనియన్‌కు కలెక్టర్ లక్ష్మీశ ధన్యవాదాలు తెలిపారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషిచేయండి

» ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
» అట్టహాసంగా గన్నవరం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం



ఏఎంసీ చైర్మన్ నర్సయ్య, పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం వ్యవసాయ మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ప్రస్తుతమున్న రూ.6.50 కోట్ల ఆదాయాన్ని వచ్చే ఏడాదికి రూ.8.30 కోట్లకు పెంచేలా కృషి చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసేవారికి పదవులు వస్తాయన్నారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా ఆదివారం జరిగింది. ఏఎంసీ చైర్మన్‌గా గూడవల్లి నరసింహారావు(నర్సయ్య), వైస్ చైర్మన్‌గా కొండేటి వెంకటేశ్వరరావు, పాలకవర్గసభ్యులతో ఎమ్మెల్యే యార్లగడ్డ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టీడీపీ మండల అధ్యక్షుడు గూడపాటి తులసీమోహన్ అధ్యక్షత వహించారు. ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు(నర్సయ్య) ప్రమాణస్వీకారానికి భారీ ర్యాలీతో వచ్చారు. నర్సయ్యను ఎమ్మెల్సీ ఆలపాటి రాజా శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ.. నెంబర్ వన్ మార్కెట్ యార్డుగా తీర్చిదిద్దాలని చెప్పారు. నర్సయ్యకు పదవి రావడానికి సహకరించిన కూటమి నేతలు సీఎం చంద్రబాబు, పవన్‌కల్యాణ్, మాధవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కూటమి పార్టీలు ఒక్కటిగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు మాట్లాడుతూ, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. పంట నిల్వ చేసుకునేందుకు అవసరమైన గోదాములను నిర్మించుకోవాలన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి మాట్లాడుతూ, రైతు కంట నీరు రాకుండా చూడాలన్నారు. డొంక రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గానికి రాష్ట్రంలోనే గుర్తింపు తెచ్చేలా పనిచేయాలన్నారు. కష్టపడిన వారికే పదవులు లభిస్తాయని నియోజకవర్గ పరిశీలకులు వడ్రాణం హరిబాబు నాయుడు అన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రెండ్రోజులుగా వైరల్ ఫీవర్‌తో బాధపడుతూనే ప్రమాణస్వీకారానికి హాజరయ్యారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, బచ్చుల బోస్, ఏఎంసీ మాజీ చైర్మన్ కోటగిరి వరప్రసాద్, బొప్పన హరికృష్ణ, కోనేరు నాని, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, చిమట రవివర్మ, కురుమద్దాలి ఫణికుమార్, దయాల రాజేశ్వరరావు, మూల్పూరు సాయికళ్యాణి, బోడపాటి రవి, గొడ్డళ్ల చినరామారావు, కోనేరు సందీప్, సర్నాల బాలాజీ, కలపాల కిరణ్, ఏడీఏ సునీల్, మార్కెట్ యార్డు ఏడీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ కృష్ణా!

(5వ పేజీ తరువాయి)

పరిశీలించకుండా నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్హతలు లేని వ్యక్తిని ప్రిన్సిపాల్ పోస్టులో నుంచి తొలగించేందుకు వర్సిటీ అధికారులు గతంలో ప్రయత్నాలు చేశారు. దీంతో సదరు ప్రిన్సిపాల్ కోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై వర్సిటీ అధికారులు మూడు విడతలుగా హైకోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం ఈ కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. బీ-ఫార్మసీ కళాశాలలో సరైన అధ్యాపకులను నియమించే విషయంలో యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం, కోర్టు కేసుల వల్లే ఈ ఏడాది అనుమతులు రాలేదని ఇక్కడ పనిచేసే అధ్యాపకులు చెప్పుకుంటున్నారు.

బుడమేరు.. అదే తీరు!

(5వ పేజీ తరువాయి)

అడ్డంకిగా మారాయి. వీటిని తొలగించేందుకు మునిసిపల్ కమిషనర్ లాంగ్ ఆర్మ్ పొక్లెయినర్లు, జేసీబీలను తెప్పించారు. చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈలు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈఈ సింధూర నేతృత్వంలో బుడమేరులో గుర్రపు డెక్క, పాలిథీన్ వ్యర్థాల తొలగింపు ఆపరేషన్ చేపట్టారు. ఈ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించటంపై ఇంజనీరింగ్ బృందాన్ని కమిషనర్ అభినందించారు. బుడమేరు కాలువతో పాటు నగరంలోని ఏలూరు, బందరు, రైవస్ కాల్వలను కూడా ప్రతి రోజూ డ్రోన్ క్యాప్చరింగ్ చేస్తూ ప్రవాహ నిరోధకాలను తొలగించేందుకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు ఇచ్చారు.

పట్టాభి భవనానికి గ్రీన్‌స్నిగల్!

(5వ పేజీ తరువాయి)

సోడిశెట్టి బాలాజీ, పి.వి. ఫణికుమార్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో భవన నిర్మాణానికి ఆమోదించకపోయినప్పటికీ జిల్లా కలెక్టర్ స్వయంగా భవన నిర్మాణానికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు వీలు కలిగిందన్నారు. భవనం నిర్మించేందుకు కృషి చేసిన ఎంపీ వల్లభనేని బాలశౌరికి, యూనియన్ బ్యాంకు ఉన్నతాధికారులకు భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.





బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ..

ఉచితం, సెలవుల ఎఫెక్ట్

పీఎన్‌బీఎస్ కిటకిట

» బస్సు ఎక్కేందుకు తీవ్ర తోపులాట

విజయవాడ సిటీ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : మహిళలకు ఉచిత ప్రయాణం, మూడు రోజుల సెలవుల అనంతరం తిరుగు ప్రయాణం కోసం వచ్చిన ప్రయాణికులతో పండిట్ నెహ్రూ బస్టాండ్ (పీఎన్‌బీఎస్) కిటకిటలాడింది. వేలాదిగా ప్రయాణికులతో బస్టాండ్, సిటీ బస్ పోర్టు కిక్కిరిసిపోయింది. ప్లాట్‌ఫాంపై బస్సు ఎక్కేందుకు తోపులాటలు జరిగాయి. ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆటో ప్రయాణాలకు మొగ్గుచూపిన మహిళా లోకం, రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కదం తొక్కినట్టు ఉంది. వివిధ పనులపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల కోసం వేచిచూస్తున్న ఘటనలు నగరంలో చోటుచేసుకుంటున్నాయి. బస్ స్టేషన్ వద్ద తప్ప ఇతర స్టాపుల వద్ద సీటు దొరకటం కష్టమే. బస్సు వచ్చీ రావడంతోనే చుట్టుముట్టేస్తున్నారు. బస్సు ప్లాట్‌ఫాంపై పెట్టనివ్వాలని.. డ్రైవర్, కండెక్టర్‌లు వేడుకుంటున్నా.. ససేమిరా అంటూ సీటు దక్కించుకోవాలనే ఆతృతతో ఎక్కేస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు మహిళల మధ్య వాగ్వాదాలు తలెత్తుతున్నాయి.

తిరుగు ప్రయాణం ఎఫెక్ట్..



పంద్రాగస్టు, కృష్ణాష్టమి, ఆదివారం.. ఇలా వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, ఏలూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాలోని సొంత ఊళ్లకు ఎన్నో కుటుంబాలు వచ్చాయి. ఇదే క్రమంలో విజయవాడ నగరంలో ఉద్యోగాలు చేస్తున్న ఎంతోమంది వారివారి సొంత ఊళ్లకు వెళ్లారు. ఆదివారంతో సెలవు ముగిస్తున్న తరుణంలో విజయవాడ నుంచి సొంత ఊళ్లకు వెళ్లిన వారు తిరిగి విజయవాడకు రావడం, వేరే ప్రాంతాల నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సొంత ఊళ్లకు వచ్చిన వారు తిరుగు ప్రయాణం ప్రారంభించడంతో ఆదివారం సాయంత్రం బస్టాండ్ కిక్కిరిసింది. సాధారణ రోజుల్లో మాదిరిగానే సమయానుకూలంగా ఉన్న బస్సులు చాలకపోవడంతో చిన్నారులు, వృద్ధులతో సహా ప్రయాణికులు ప్లాట్ ఫాం పైనే పడిగాపులు పడిన దృశ్యాలు కనిపించాయి.

జాతీయ రహదారులపై ట్రాఫిక్ కష్టాలు

మూడు రోజుల అనంతరం సొంత కారులో హైదరాబాద్ వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో విజయవాడ-హైదరాబాద్, మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి కిక్కిరిసింది. రాత్రి 7.30 నుంచి జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగింది. రోడ్డుపై కారుల సంఖ్య విపరీతంగా పెరగడంతో విజయవాడ నగరంలోని బెంజిసర్కిల్, స్క్యూబ్రిడ్జి కృష్ణలంక ప్రాంతాలతో పాటు, గొల్లపూడి వద్ద ట్రాఫిక్ స్తంభించింది. వాహనాలు ముందుకు సాగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

బార్‌లు @183

(5వ పేజీ తరువాయి)

కృష్ణా జిల్లాలో నాలుగు బార్‌లను గీత కార్మికులకు రిజర్వ్ చేశారు. ఈ బార్‌లను గౌడ, గౌడ్ ఉప కులాలకు కేటాయిస్తారు. ఏ బార్ ఏ ఉపకులానికి కేటాయిస్తారన్న విషయం సోమవారం తేలుతుంది. జిల్లా కలెక్టర్ లాటరీ ద్వారా గౌడ, గౌడ్ ఉప కులాలకు ఏయే నంబర్ల బార్‌లు కేటాయించాలన్నది నిర్ణయిస్తారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 162 బార్‌లు ఉన్నాయి. ఇందులో ఎన్టీఆర్ జిల్లాలో 120, కృష్ణాజిల్లాలో 32 బార్‌లు ఉన్నాయి. ఇవి కాకుండా మరో పది స్టార్ హోటళ్లలో ఉన్నాయి. వాటి లైసెన్స్ గడువు ఈనెలాఖరుతో పూర్తవుతుంది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం రూపొందించిన కొత్త బార్ విధానం ప్రకారం లైసెన్స్‌లను జారీ చేస్తారు.

ఎక్కడెక్కడంటే...

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 130 బార్లను ఓపెన్ కేటగిరికి, పది బార్లను గీత కార్మికులకు కేటాయించారు. విజయవాడలో 117 బార్‌లు ఓపెన్ కేటగిరికి, తొమ్మిది బార్‌లు గీత కార్మికులకు రిజర్వ్ చేశారు. జగ్గయ్యపేటలో రెండు, నందిగామలో రెండు, తిరువూరులో ఒక బార్‌ను ఓపెన్ కేటగిరికి కేటాయించారు. కొండపల్లిలో ఎనిమిది బార్‌లను ఓపెన్ కేటగిరికి, ఒక బార్‌ను గీత కార్మికులకు రిజర్వ్ చేశారు. కృష్ణాజిల్లాలో 39 బార్లను ఓపెన్ కేటగిరికి, నాలుగు బార్‌లను రిజర్వేషన్ కేటగిరికి ఇచ్చారు. మచిలీపట్నంలో పది బార్‌లను ఓపెన్ కేటగిరికి, ఒక బార్‌ను రిజర్వేషన్‌లో ఉంచారు. పెడనలో ఒకటి, ఉయ్యూరులో ఒక బార్ ఏర్పాటు కాబోతున్నాయి. ఈ రెండింటిని ఓపెన్ కేటగిరికి కేటాయించారు. గుడివాడలో పది బార్‌లను ఓపెన్ కేటగిరికి, ఒక బార్‌ను గీత కార్మికులకు, తాడిగడపలో 14 బార్‌లను ఓపెన్ కేటగిరికి, రెండు బార్‌లను గీత కార్మికులకు కేటాయించారు. ఇవి కాకుండా పర్యాటక కేటగిరిలో మంగినపూడలో ఒకటి, అవనిగడ్డలో రెండు బార్‌లను ఏర్పాటు చేయబోతున్నారు. లాటరీ ద్వారా ఎంపికైన బార్‌లకు 2028 ఆగస్టు 31 వరకు లైసెన్స్‌ను ఇస్తారు.

డీఏ బకాయిలపై హైకోర్టుకు

» బకాయిలు చెల్లించకపోతే పెన్షన్ మార్చ్
» ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్

విజయవాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) హైకోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు బాజీ పఠాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు డీఏబకాయిలు చెల్లించడానికి ప్రభుత్వం జీవో విడుదల చేసినప్పటికీ ఐదేళ్లగా ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ కాలేదని, ప్రభుత్వానికి, అధికారులకు వందలసార్లు విన్నవించుకున్నా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. హైకోర్టు, అసెంబ్లీలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగులకే బకాయిలు చెల్లించి, మిగిలినవారికి ఇంత వరకు చెల్లించకపోవడం రాజ్యాంగ ఉల్లంఘనే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేసి మరణించిన వారి కుటుంబాలకు డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించడానికి సెప్టెంబరు 1న 'పెన్షన్ మార్చ్' చేస్తామని తెలిపారు. నాగార్జున వర్సిటీ నుంచి విజయవాడ అంబేడ్కర్ విగ్రహం వరకు నల్లదుస్తులు ధరించి పాదయాత్రగావెళ్లి నిరసన తెలుపుతామని, మార్చ్‌ను ఉద్యోగులు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505	

పేదలకు అండగా సీఎం సహాయనిధి



హనుమాన్‌జంక్షన్‌రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు అత్యవసర సమయాల్లో సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని సర్పంచ్ కాటూరు విజయభాస్కర్ అన్నారు. బొమ్ములూరుకు చెందిన గుజ్జుల రమాదేవి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఆమె పరిస్థితిని గ్రామ టీడీపీ నాయకులు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధి మంజూరు చేయించారు. ఈ చెక్కును ఆదివారం బాధితురాలికి అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ గుల్లపూడి ప్రసాద్, టీడీపీ ఉపాధ్యక్షుడు దాసరి రాజేష్, తెలుగు యువత జిల్లా అధికారప్రతినిధి గండేపూడి నిలీష్‌కుమార్, చల్లా ప్రకాష్, వాసు, బడుగు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మీదపడిందా.. కటౌట్

- ప్రమాదకరంగా భారీ కటౌట్‌లు
- సర్వీసు రోడ్డుపై నుంచి వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు
- పంచాయతీ అనుమతి లేకుండానే ఏర్పాటు
- భయపడుతున్న వాహనచోదకులు

(ఉయ్యూరు- ఆంధ్రజ్యోతి)

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డు వెంబడి మూర్తిరాజుపాలెం రోడ్డువద్ద రియల్ ఎస్టేట్ సంస్థలు ఏర్పాటు చేసిన భారీ కటౌట్‌లు, బోర్డులు ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయి. సర్వీసు రోడ్డు నుంచి మూర్తిరాజుపాలెం, కంకిపాడు మండలం కుందేరు గ్రామాలకు వెళ్లేరోడ్డులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లువేసి సర్వీసు రోడ్డును అనుకుని పెద్ద కటౌట్‌లు ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల నుంచి వచ్చే వారికి సర్వీసు రోడ్డుపై వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. అదే విధంగా ఆకు నూరు వైపు నుంచి సర్వీసు రోడ్డుపై వచ్చేవారికి మూర్తిరాజు పాలెం వైపునుంచి వచ్చే వాహనాలు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మూర్తి రాజు పాలెం రోడ్డులో వైన్‌షాపు ఉండటం వలన అనునిత్యం రద్దీగా ఉంటుంది. షాపు వద్ద నుంచి వచ్చేవారికి సర్వీసు రోడ్డు కన్పించక ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ నుంచి ఏవిధమైన అనుమతులు లేకుండా కటౌట్‌లు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఉయ్యూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కటౌట్‌లు తొలగించాలని కోరుతున్నారు.



విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో మూర్తిరాజుపాలెం వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా భారీ కటౌట్


డ్వాక్రా మహిళకు ఎగ్ కార్టును అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

మహిళా స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయం : బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని వర్గాల మహిళలను ఆర్థికంగా వృద్ధిలోకి తేవడమే టీడీపీ కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని గోసాల గ్రామానికి చెందిన భద్రావతి గ్రూపు సభ్యురాలు బిల్లా రాజ్యలక్ష్మి ఆర్థిక భరోసా కోసం 50వేల విలువైన ఎగ్ కార్ట్ అందించే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పోషకాహార లోపాలను నివారించే క్రమంలో కోడిగుడ్ల వాడకాన్ని ప్రోత్సహించే విధంగా నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ(నెక్)తో టీడీపీ కూటమి ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా సెర్ప్ అధికారులు ఆమెకు ఎగ్ కార్టును అందజేశారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఎగ్‌కార్టులను డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న సిద్ధార్థ వర్సిటీ వీసీ డాక్టర్ రత్నప్రసాద్

సిద్ధార్థ వర్సిటీ వీసీ రత్నప్రసాద్‌కు పురస్కారం

కానూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్‌ను ప్రతిష్టాత్మకమైన ఐఎస్‌టీఈ ఆంధ్రప్రదేశ్ స్టేట్ అవార్డు అయిన బెస్ట్ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ అవార్డు-2024 వరించింది. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐఎస్‌టీఈ) సంస్థ ఈ అవార్డును ప్రకటించింది. మదనపల్లిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో జరిగిన ఐఎస్‌టీఈ స్టేట్ స్టూడెంట్ కన్వెన్షన్ అవార్డుల కార్యక్రమంలో రత్నప్రసాద్ ఈ అవార్డును అందుకున్నారు. ఆ సంస్థ న్యూఢిల్లీ అధ్యక్షుడు నుంచి జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్సలర్, ఐఎస్‌టీఈ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమక్షంలో ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, రిజిస్ట్రార్ ఎం. రవిచంద్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు, రత్నప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

ప్రజాపోరాటాలు ఉధృతం చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

ఉయ్యూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో ఆదివారం జరిగిన పార్టీ ప్లీనరీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ మతన్మోద రాజకీయాలకు వేదికలుగా మారాయని ఆరోపించారు. స్వాతంత్ర దినోత్సవ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని దేశప్రజలపై రుద్దాలని చూశారని, బీజేపీ పాలనలో మాత్రమే దేశం అభివృద్ధి చెందనడం సరికాదన్నారు. దేశ సమైక్యత, సమగ్రతను గాలికి వదిలి ఆర్‌ఎస్‌ఎస్ భజన చేశారని విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజాపోరాటాలను స్థానిక సమస్యలపై ఆందోళనలతో ఉధృతం చేయాలన్నారు. కొడాలి శర్మ, కళ్లం వెంకటేశ్వరరావు, వై. నరసింహారావు, శివనాగేంద్రం, ధనశ్రీ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.


రాష్ట్రపతి సేవా పతకాన్ని అందుకున్న షేక్ ఘనిని సత్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్

రాష్ట్రపతి సేవా పతకం అందుకున్న ఘనికి ఘన సత్కారం

ఉయ్యూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అగ్నిమాపక శాఖ విశ్రాంత ఉద్యోగి, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు షేక్ ఘనికి భారత రాష్ట్రపతి సేవా పతకాన్ని అందుకున్న సందర్భంగా ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. అగ్నిమాపక శాఖలో ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఘని అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా భారత రాష్ట్రపతి సేవా పతకాన్ని స్వాతంత్ర దినోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి అందుకున్న సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సత్కరించింది. బాపిరాజు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, కిషోర్, మస్తాన్, సలీమ్ ఘనికి శుభాకాంక్షలు తెలిపారు.

రైతులకు అందుబాటులో ఉండండి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పునాదిపాడు పీఏసీఎస్ చైర్‌పర్సన్, సభ్యుల ప్రమాణస్వీకారం ఆదివారం పునాదిపాడులో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సొసైటీల ద్వారా రైతులకు అందించాలన్నారు. ప్రణాళిక రూపొందించుకొని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం కావాలన్నా నిత్యం తాను అందుబాటులో ఉంటానన్నారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా యార్లగడ్డ వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్లుగా కవిరి రమణయ్య, గోలి దుర్గాలతో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, మద్దాలి సాయిబాబు, అనుమోలు శ్రీనివాసరావు, కవిరి సంజీవరావు, పులి శ్రీనివాసరావు, మోహన్‌కృష్ణ, జనసేన పార్టీ నాయకులు పులి కామేశ్వరరావు, ముప్పా రాజ తదితరులు పాల్గొన్నారు.


పునాదిపాడు సొసైటీ చైర్‌పర్సన్, సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

బోళ్లపాడులో..

ఉయ్యూరు: ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు, రాయితీపై వ్యవసాయ, యంత్ర పనిముట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా ఆర్థికసాయం అందిస్తూ రైతు సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బోళ్లపాడులో ఆదివారం పీఏసీఎస్ పాలక వర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చైర్మన్‌గా గుంటక లక్ష్మీనా రాయణరెడ్డి, డైరెక్టర్లుగా తాబేటి యోహోను, కుక్కల చక్రవర్తిచేత ప్రమాణస్వీకారం చేయించారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి చంద్రబాబు కృషి చేస్తూ ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, ధాన్యానికి నెలల తరబడి డబ్బురాక అనేక కష్టాలుపడిన పరిస్థితుల్లో ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారన్నారన్నారు. ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, కూటమి నాయకులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీతో గన్నవరం వెళ్తున్న ముప్పంగి శేషగిరిరావు, డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, తెలుగు యువత నాయకుడు కూచిపూడి కిషోర్

రైతులకు అండగా నిలబడతాం

ఏఎంసీ డైరెక్టర్లు ముప్పంగి శేషగిరిరావు, బాణావతుల ఆదియ్య

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా నిలబడి మార్కెట్ యార్డ్ పురోభివృద్ధికి కృషి చేస్తామని ఏఎంసీ డైరెకర్లు ముప్పంగి శేషగిరిరావు, బాణావతుల ఆదియ్య అన్నారు. రంగయ్యప్పారావుపేట గ్రామానికి చెందిన ముప్పంగి శేషగిరిరావు (బాబూరావు), రేమల్లెకు చెందిన బాణావతుల ఆదియ్య గన్నవరం ఏఎంసీ డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారోత్సవానికి ఆదివారం వేర్వేరుగా భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పెరికీడు వద్ద మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించగా డీసీ చైర్మన్ కొమ్మరెడ్డి రాజేష్, తెలుగు యువత నాయకుడు కూచిపూడి కిషోర్ ఆధ్వర్యంలో 235 బైక్‌లతో భారీగా తరలివెళ్లారు. టీడీపీ జెండాలతో అలంకరించిన ట్రాక్టర్‌పై వీరమాచనేని సత్యప్రసాద్ డ్రైవింగ్ చేస్తూ ముప్పంగి శేషగిరిరావును ప్రమాణ స్వీకారోత్సవానికి ర్యాలీగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు దన్నే దుర్గారావు, యజ్ఞవరపు శ్రీనివాసరావు, మాదాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● టీడీపీ అధ్యక్షుడు కొల్లూరి చంద్రకాంత్, తెలుగు యువత నాయకుడు కలపాల పింకు ఆధ్వర్యంలో ఏఎంసీ డైరెక్టర్ బాణావతుల ఆదయ్య రేమల్లె నుంచి బైక్‌లు, ట్రాక్టర్లతో ర్యాలీగా గన్నవరం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఈడే అక్కయ్య, నారాయణ, గుడివాడ విజయానంద్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.


రేమల్లె నుంచి గన్నవరం తరలివెళ్తున్న బాణావతుల ఆదియ్య

దారి స్థలం వివాదం- పరస్పరం దాడులు

ఉంగుటూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సరిహద్దు దారి స్థలం విషయంలో దాయాదుల మధ్య చెలరేగిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి పరస్పర దాడులకు దారితీసిన ఘటన ఇందుపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై యు.గోవిందు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మసిముక్కు వడ్డీకాసులు, మసిముక్కు చింతయ్య ఇద్దరు అన్నదమ్ములు. వారసత్వంగా సంక్రమించిన స్థలంలో ఇరు కుటుంబాలకు సరిహద్దున దారి వదిలేసి ఇళ్లు నిర్మించుకున్నారు. దారి విషయంలో గతంలో పలుమార్లు దాయాదుల మధ్య గొడవలు జరుగగా సివిల్‌కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం వడ్డీకాసులు భార్య సత్యవతి, చింతయ్య భార్య సీతామహాలక్ష్మి ఘర్షణకు దిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.


బాపులపాడు శివాలయంలో అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహిస్తున్న వేదపండితులు

అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): బాపులపాడు శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంతోపాటు విఘ్నేశ్వరస్వామి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, మలికాపు రత్తమ్మ అమ్మవారు, ద్వారపాలకుల ఆలయాల నిర్మాణాలకు సంబంధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పుల్లేటికుర్తి గణపతిశర్మ, పాలకుర్తి ప్రేమ్‌చంద్, సామవేదం మారుతీ శర్మల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు గూడపాటి రత్నశేఖర్, తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, దాత వల్లభనేని అనిల్, కాకుల శ్రీను, తుమ్మల నారాయణరావు తదితరులు సతీసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టీ కాకాని అరుణ, టీడీపీ నేత మూల్పూరి సురేంద్ర, పలువురు స్థానిక ప్రముఖులు హాజరయ్యారు.

మాట నిలబెట్టుకున్న చంద్రబాబు

పెదఓగిరాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి

ఉయ్యూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సందర్భంగా ప్రకటించిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట నిలబెట్టుకుంటున్నారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండ మూడి చౌదరి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద ఓగిరాలలో స్థానిక నాయకులతో కలసి పర్యటించి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటా ప్రచారం చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం అమలు చేసి స్త్రీశక్తి పథకం ప్రారంభించడంతో మహిళలు ఎంతో సంతోషంగా చంద్ర బాబుకు కృతజ్ఞతలు తెలుతున్నారని, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుం దన్నారు. పార్టీ నాయకులు బి.ప్రసాదరెడ్డి, పోతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, జలీల్ తదితరులు పాల్గొన్నారు.


పెదఓగిరాలలో టీడీపీ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తూ కరపత్రాలను అందజేస్తున్న తెలుగు యువత నాయకుడు దండమూడి చౌదరి


నున్న కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఈఓ హేమలతాదేవి

నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం

పోరంకి వేణుగోపాలస్వామి దేవస్థానం కమిటీతో ప్రమాణస్వీకారం చేయించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలోని పోరంకి వసంత వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ ఆదివారం కొలువుదీరింది. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సమక్షంలో దేవాదాయశాఖ ధృవపరిచిన ఎనిమిది మంది సభ్యుల కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆలయంలో భక్తులకు అవసరమయిన సౌకర్యాల మెరుగుకు కమిటీ తోడ్పడాలని, ఆలయ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని సూచించారు.

నున్న కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో..

విజయవాడ రూరల్ : మండలంలోని నున్న కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. ఆలయ కార్యనిర్వాహణాధికారిణి హేమలతాదేవి ఆధ్వర్యంలో తొమ్మిది మంది సభ్యులతో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా భీమవరపు శంకరరెడ్డి, డైరక్టర్లుగా మరో ఎనిమిది మంది ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి ఫణికుమార్ పాల్గొన్నారు.

డిసెంబరు 18న ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవాలు

గుడివాడ, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వజ్రోత్సవాలు డిసెంబరు 18న నిర్వహిస్తున్నామని కళాశాల పాలకవర్గ కార్యదర్శి కాట్రగడ్డ సింహాద్రి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరు అవుతారని ఆయన పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

కొండాలమ్మకు పాలపొంగళ్లు

గుడ్లవల్లేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం 25,000 మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆయల కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. వేకువ జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో దేవస్థానానికి చేరుకొని అమ్మవారికి పాలపొంగళ్లు వండి సమర్పించి తమ మొక్కులను చెల్లించుకొన్నారు. ఒక దశలో క్యూలేన్‌లు నిండిపోయి, ఆలయం బయటి వరకూ భక్తులు అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న పరిస్థితులు ఏర్పడ్డాయి. పోలీసులు ఎం అండ్ కే ప్రధాన జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయాలు కలుగకుండా నియంత్రణ చేశారు. భక్తులకు దేవస్థానం వారిచే ప్రసాదం అందజేశారు.


కొండాలమ్మ ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

ఏఎన్ఆర్ కళాశాల వజ్రోత్సవాలు డిసెంబరులో..

గుడివాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వజ్రోత్సవాలు డిసెంబరు 18న నిర్వహిస్తున్నామని కళాశాల పాలక వర్గ కార్యదర్శి కాట్రగడ్డ సింహాద్రి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర విద్యాశాఖామాత్యులు నారా లోకేశ్ హాజరు అవుతారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో పాటు నారా లోకేశ్‌ను కలసి కళాశాల వజ్రోత్సవాలకు, ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరినట్టు తెలిపారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్టు వివరించారు. మంత్రి నారా లోకేశ్‌ను కలసిన వారిలో కళాశాల పాలక వర్గ సభ్యులు కొల్లి శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్‌లు ఉన్నట్టు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

గుడ్లవల్లేరు : డోకిపర్రులో ఆగస్టు 19 మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణా పరీక్షల శిబిరాన్ని సుధారెడ్డి ఫౌండేషన్, ఎంఇఐఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన మిస్‌వరల్డ్ పోటీల్లో విజేత మిస్‌వరల్డ్ 2025 ఓపల్ సుచత చాంగ్‌శ్రీ, మిస్ ఏషియా 2025 క్రిష్నాగ్రావెడేజ్‌లు ఈ శిబిరాన్ని ప్రారంభించనున్నారని వారు తెలిపారు. మిస్‌వరల్డ్ ఎంబాసిడర్ సుధారెడ్డి సారథ్యంలో క్యాన్సర్ అవగాహనా కార్యక్రమంలో భాగంగా చుట్టుపక్కల మహిళలకు రొమ్ముక్యాన్సర్ (బ్రెస్ట్ క్యాన్సర్) నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

విలియం కేరీ సేవలు మరువలేనివి

పెదపారుపూడి: పేద ప్రజల కోసం తన జీవితాన్ని సమర్పించిన వ్యక్తి విలియం కేరీ అని సీబీసీఎన్‌సీ ఉయ్యూరు వెస్ట్ ఫీల్డ్ ఫాస్టర్ బి.అశోక్ ఆదివారం అన్నారు. మండలంలోని మహేశ్వరపురం గ్రామ బాప్టిస్ట్ చర్చిలో విలియం కేరీ పుట్టిన రోజు సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సీబీసీఎన్‌సీ ఉయ్యూరు వెస్ట్ ఫీల్డ్ ఫాస్టర్ బి.అశోక్ విలియం కేరి గురించి ముఖ్య ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఫాస్టర్ మాట్లాడుతూ విలియం కేరి భారతదేశానికి మొట్టమొదటగా నిరుపేదలకు సేవ చేయటానికి మిషనరీగా వచ్చి బాల, బాలికలకు విద్యాలయాలు నిర్మించారన్నారు. అలాగే ప్రార్థన చేసుకోవటానికి దేవాలయాలు, ఆరోగ్య సమస్యలకు వైద్యాలయాలు, బాప్టిస్ట్ మిషనరీ సొసైటీ తరఫున నిర్మాణం చేపట్టి 41 సంవత్సరాలు అక్షర జ్ఞానం లేని నిరుపేదలకు అనేక రకాలైన సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘస్తులు పాల్గొన్నారు.

శిథిల వంతెనపై భయం.. భయం

- వంతెన ఐరన్ మొత్తం తుప్పుతో రంధ్రాలు
- చిన్న వాహనాలకు మాత్రమే ఉపయోగకరం
- భయాందోళనలో ప్రయాణికులు

(ఆంధ్రజ్యోతి - తోట్లవల్లూరు) : బందరు కాలువపై 1913లో బ్రిటీష్ పాలకులు నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. 112 సంవత్సరాలు గడవటంతో వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియక ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ వంతెన గతంలో తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం ప్రజలు ఉయ్యూరు వెళ్లేందుకు ఉపయోగపడేది. వంతెన బలహీనపడటంతో సుమారు 40 సంవత్సరాల క్రితం దీని ప్రక్కనే బందరు కాలువ, ఏనుగులకోడు డ్రెయిన్‌పైగా ఏక వంతెన నిర్మించారు. ఈ కొత్త వంతెన కేవలం తోట్లవల్లూరు ప్రజలకు మాత్రమే ఉపయోగపడుతోంది. భద్రిరాజుపాలెం ప్రజలు తోట్లవల్లూరు వంతెనపైకి రావాలంటే రెండు ప్రమాదకరమైన మలుపులు తిరిగాల్సి ఉంటోంది. చెరకు లోడుతో వచ్చే ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు ఈ మలుపుల్లో ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రక్కనే ఉన్న ఈ 112 వసంతాల వంతెనపైగా ప్రయాణించాలంటే క్షణం క్షణం భయం అన్నట్టుగా పరిస్థితి తయారైంది. పురాతన వంతెనపై ఐరన్ బాడీశ్లాబు పూర్తిగా పాడైపోయి పెద్దపెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. దీనిపై మెరకకు గ్రావెల్ వేయటంతో బరువుతో ఎప్పుడు కూలుతుందోనని భయంగా ఉందని భద్రిరాజుపాలెం ప్రజలు చెపుతున్నారు. భద్రిరాజుపాలెం ప్రజలు ఉయ్యూరు వెళ్లాలంటే ఈ వంతెనపైగా ప్రయాణించాలి. పూర్తిగా రాతి గోడలపై ఐరన్ బాడీతో నిర్మించిన వంతెన నేటికీ చిన్న వాహనాలు. ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వంతెనపైగా రాకపోకలు సాగించేందుకు ఉపయోగపడుతోంది. చెరకు సీజన్‌లో ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు చెరకు లోడుతో తోట్లవల్లూరు వంతెనపైగా వెళ్లేందుకు మలుపులతో ఇబ్బంది పడుతున్నామని అంటున్నారు.


శిథిలావస్థకు చేరిన వంతెన



వంతెన నిర్మించిన 1913వ సంవత్సరం నాటి శిలాఫలకం

కొత్త వంతెన నిర్మాణం అవసరం



పాతవంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. బైక్‌లు తప్పా వేరే వాహనాలు వెళ్లాలంటే భయపడుతున్నారు. భద్రిరాజుపాలెం నుంచి నిత్యం ఉయ్యూరుకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. వంతెనపైగా వెళ్లేందుకు భయపడుతున్నారు. పాత వంతెన తొలగించి కొత్త వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

కొక్కిలిగడ్డ హేమలత, సర్పంచ్, భద్రిరాజుపాలెం

ఏక వంతెన నిర్మించాలి



బందరు కాలువపై పాత వంతెన ఎప్పుడు పడిపోతుందో తెలియని విధంగా పాడైపోయింది. తోట్లవల్లూరు వంతెనపైగా వెళ్లాలంటే మలుపుల్లో ప్రమాదాలకు గురై పడిపోతున్నాయి. ఇది చాలా కష్టంగా మారింది. భద్రిరాజుపాలెంకు బందరు కాలు, ఏనుగుల కోడు డ్రెయిన్‌పై ఏక వంతెన నిర్మించటం ఎంతో అవసరం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలి.

చాగంటి సాంబిరెడ్డి, మాజీ సర్పంచ్


పామర్రు -పెదమద్దాలి వెళ్లే రహదారిపై చెన్నువానిపురం వద్ద కల్వర్టుకు ఒకవైపు దెబ్బతిన్న రక్షణగోడ

పొంచి ఉన్న ప్రమాదం

● ఆందోళనలో ప్రయాణికులు

పామర్రు, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): పామర్రు నుంచి పెదమద్దాలి పోయే ఆర్అండ్‌బీ రహదారిలో చెన్నువానిపురం వద్ద గల కొత్తకోడు కాల్వ కల్వర్టుపై రక్షణగోడ పడిపోయి ప్రమాదకరంగా మారింది. కొంతకాలం కిందట రక్షణగోడ పడిపోయినప్పటికీ దానిని పట్టించుకోకుండానే సంబంధిత శాఖ అధికారులు గడిచిన ఆరు నెలల కిందట రహదారికి మరమ్మతులు చేశారు. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి నుంచి బల్లిపర్రు జంక్షన్‌నుంచి మలుపు తిరగానే వాహనదారులు చాల ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టుకు గల రక్షణ గోడ పడిపోయిన చోట కనీసం ప్రమాద సూచకలు ఏర్పాటు చేయకపోవడంతోపాటు రాత్రి సమయంలో వీధిలైట్లు సైతం లేకపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం ముంచుకు వస్తుందోననే భయంతో చెన్నువానిపురం వాసులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి తక్షణమే కల్వర్టుకు రక్షణ గోడ నిర్మించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాలికోన్నత పాఠశాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాఠశాలగా అవార్డును పొందటం అభినందనీయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కొనియాడారు. ఆదివారం గుడివాడలో ఎమ్మెల్యే గృహంలో ఎమ్మెల్యేను కలసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ పాఠశాలలో గతేడాది పదవతరగతి చదివిన 74 మంది ఉత్తీర్ణులు కాగా 71 మందికి ఫస్ట్‌క్లాస్ రావడం హర్షదాయకమన్నారు. ఈ పాఠశాల విద్యార్థిని కతిజ తెహర 571 మార్కులతో షైనింగ్ అవార్డును పొందటంతోబాటుగా, ట్రిపుల్ ఐటీకీ ఎంపికైందని ఎమ్మెల్యే రాముకి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గుడ్లవల్లేరు మండల ఎంఈవో జగన్మోహనరావు తెలిపారు. కాగా రాష్ట్ర ఉత్తమ అవార్డును జగన్మోహనరావు సీఎం చంద్రబాబు చేతులమీదుగా అందుకోవడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. నారా లోకేశ్ నేతృత్వంలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ కొత్తపుంతలుతొక్కుతోందని, దానివల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరే విధంగా ఉందని వెనిగండ్ల రాము అన్నారు. అంగలూరు బాలికోన్నత పాఠశాల స్ఫూర్తిగా నియోజకవర్గంలో మరిన్ని పాఠశాలలు ఉత్తమ స్థాయికి ఎదగాలని అందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలని రాము అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఉపాధ్యాయులు కలపాల రత్నం, తలసిల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

గుడ్లవల్లేరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులోని గంగానమ్మ అమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, నూతన ఆలయ నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నట్టు నిర్వాహక కమిటీకి చెందిన వల్లభనేని వెంకట సుబ్బారావు చౌదరి పేర్కొన్నారు. రాష్ట్రంలోనే రెండవ అన్నవరంగా ఖ్యాతిగాంచిన గుడ్లవల్లేరు శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ గోపుర జీర్ణోద్ధరణ, ఆలయ ఆధునీకరణ పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం సత్యదేవుని ఆలయంలో గ్రామస్థులు, నిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. వల్లభనేని కృష్ణ (అమెరికా) తన తండ్రి వల్లభనేని రామచంద్రరావు(బాబ్జి) జ్ఞాపకార్థం రూ. 50 వేలు తన స్నేహితుడు అట్లూరి అమర్ ద్వారా అందజేశారు. అలానే గొల్లపూడికి చెందిన మాచనేని అరవింద్ గోష్ రూ. 50 వేలు అడుసుమిల్లి సుబ్బయ్య ద్వారా, వినగిరి పోతురాజు తన తండ్రి సన్యాసిరావు, తాత అప్పలస్వామిల జ్ఞాపకార్థం రూ 30 వేలు, శనగశెట్టి శేషుబాబు రూ.10116 లు, కాశేపల్లి అనీల్‌కుమార్, నాగషర్మిల రూ. 15116లు, కాశేపల్లి సూర్యతేజ, విష్ణువందనల కుమార్తె లాస్యశ్రీమాన్వి రూ 10116 లు, కోడే జనార్ధనరావు రూ.5116 లు అందజేశారని సుబ్బారావు చౌదరి తెలిపారు. వల్లభనేని వెంకట్రావు, కొనరాజు బాపయ్యచౌదరి, ఈడ్పుగంటి ఉమామహేశ్వరరావు, పొట్లూరి రవికుమార్, పోలవరపు వెంకటరావు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు, చాపరాల రాజేశ్వరరావు, అడుసుమిల్లి నాగేశ్వరరావు, యెనిగళ్ల నాగేశ్వరరావు, నాగరాజు కె.ప్రభాకరరావు, కె.వి.సుబ్బారావు, స్వామి.పి.నరసింహారవు, ఎం.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట సుబ్బారావు

పింఛన్ల తొలగింపునకు ఉత్తర్వులు జారీ

కూచిపూడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, మంచానికే పరిమితమైన రోగుల పింఛన్లు పరిశీలించిన అనంతరం 370 మందిని అనర్హులుగా గుర్తించి సెప్టెంబరు నెల నుంచి వారి పింఛన్లు నిలిపివేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వం పంపిన సమాచార ఉత్తర్వులను తొలగించనున్న లబ్ధిదారులకు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు గ్రామాల వారీగా అందిస్తున్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు తీసుకునే లబ్ధిదారుల్లో 366 మందిని అనర్హులుగా గుర్తించారు. రూ.15 వేలు తీసుకునే లబ్ధిదారుల్లో నలుగురిని పూర్తి అనర్హులుగా గుర్తించారు. అయితే 15 వేలు తీసుకునే పింఛన్ లబ్ధిదారుల్లో 25 మందిని వృద్ధాప్య పింఛన్‌దారులుగానూ, మరో 26 మందిని దివ్యాంగుల పింఛన్‌దారులుగా మార్పు చేశారు. మండలంలో తొలగింపు చేసిన దివ్యాంగుల పింఛన్ దారుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పెదపూడి సచివాలయంలో 35 మంది, పెదముత్తేవిలో 10, అవిరిపూడిలో 33, చినముత్తేవిలో 20, భట్లపెనుమర్రులో 20, మొవ్వ -1లో 32, మొవ్వ-2లో 18, కూచిపూడిలో 30, కోసూరులో 31, నిడుమోలులో 25, మంత్రిపాలెంలో 29, అయ్యంకిలో 23, పెడసనగల్లులో 15, వేములమడలో 9, కాజ -1లో 16, కాజ -2లో 20 తొలగించారు.


పింఛన్‌దారునికి నోటీసు అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

ఘనంగా గంగానమ్మ జాతర

పెదపారుపూడి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడిలోని వానపాముల గ్రామంలో గంగానమ్మ జాతర సందర్భంగా భారీ అన్నసమారాధన ఆ గ్రామ ప్రముఖులు దేవర నాని ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు 19 గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెదపారుపూడి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, టీడీపీ లీగల్ విభాగం అడ్వయిజర్ గొరిపర్తి రవికుమార్, జడ్పీటీసీ మాజీ సభ్యులు చిలక ఆంజనేయులు, దానబోయిన వెంకట నారాయణ, గోగం రామారావు, వంపుగళ్ల సుబోస్, రాచూరి ప్రభుదాస్, కలపాల కిషోర్, వైసీపీ మండల కన్వీనర్, ఎంపీపీ గోగం సురేష్, వైసీపీ సీనియర్ నాయకుడు గోళ్ల సోమేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పల్లా అరవింద్, సర్పంచ్ పాతూరి రమేష్, మాజీ సర్పంచ్ ఎలిసే డేవిడ్‌రాజు పాల్గొన్నారు.


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

కొనకళ్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం

గుడివాడ, అగస్టు 17(ఆంధ్రజ్యోతి) : మండవల్లి గ్రామానికి చెందిన రాణికి స్థానిక ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమవ్వడంతో కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు దేసు సురేష్ ఆదివారం రక్తదానం చేశారు. రక్తదాత సురేష్‌ను ట్రస్ట్ చైర్మన్ కొనకళ్ల సీతయ్య, రాణి కుటుంబసభ్యులు, పలువురు అభినందించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్జీవో నేతలు

పాత పెన్షన్‌ను అమలు చేయాలి

గుడివాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ సాధనకై ఆగస్టు 25న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నా పోస్టర్‌ను ఎన్‌జీవో నాయకులు విడుదల చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో మహాధర్నా పోస్టర్‌ను జిల్లా ఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె ఫరీద్ భాష, జి.రాజేంద్రప్రసాద్, యూటీఎఫ్ కృష్ణాజిల్లా గౌరవ అధ్యక్షులు నీలం ప్రభాకర్, ఎస్టీయూ కృష్ణాజిల్లా అధ్యక్షుడు డి. చంద్రశేఖర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏ.వి వరలక్ష్మి, యూటీఎఫ్ నాయకులు జి. రాజారావు, మేడ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ కార్యమంలో రాష్ట్ర కన్వీనర్ కె.ఎల్ శ్రీనాథ్, జి. జయరాజు, ఫోరం సభ్యులు, ఎస్. జయశ్రీ, కె. కృష్ణకాంత్, ఆర్. జగదీష్, ఏలియాపాల్గొన్నారు.

ఈ రహదారిపై ప్రయాణం నరకం


తోట్లవల్లూరు-ఉయ్యూరు రోడ్డులో 4వ కిలోమీటర్ వద్ద గోతులతో అధ్వానంగా తయారైన రోడ్డు

తోట్లవల్లూరు, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు-ఉయ్యూరు ఆర్అండ్‌బీ రోడ్డులో గోతులు ప్రమాదకరంగా మారాయి. 4వ కిలో మీటర్ వద్ద చెరువలా మారిన గోతుల్లోనే ఓ గుంట(రంధ్రం) ఏర్పడింది. మీటరులోతు రంధ్రం ఏర్పడటంతో రాత్రి సమయంలో ప్రయాణించే ద్విచక్ర వాహనాల టైర్లు అందులో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఉత్తరం వైపు మార్జిన్ వద్ద రెండు అడుగుల వెడల్పున ఏర్పడిన గొయ్యి టెర్రర్ పుట్టిస్తోంది. ఆటోలు సైతం ఈ గోతుల్లో రాలేకపోతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు కిలోమీటర్ల పొడవున రోడ్డులో అనేకచోట్ల ఈ విధమైన గోతులున్నాయి. కొత్త రోడ్డు నిర్మించటం ఈ సమయంలో సాధ్యం కాదని, జీఎస్‌పీ డస్ట్ అయినా తోలి గోతులను లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


రోడ్డు మార్జిన్‌లో ఏర్పడిన గోతులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

బైక్ దొంగ అరెస్టు .. రిమాండ్‌కు తరలింపు

గుడివాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : స్థానిక యానాదుల కాలనీకి చెందిన జనార్ధనపురం ఏసుబాబు ఏపీ 16సీఎక్స్ 4947 నెంబరు గల తన ద్విచక్రవాహనాన్ని శనివారం రాత్రి ఇంటి ముందు పార్కు చేశాడు. ఆదివారం తెల్లవారుజాము నిద్రలేచి చూడగా తన బైక్‌ను స్థానిక గుడ్‌మెన్‌పేటకు చెందిన బి.రాజ్‌కుమార్ తోసుకుంటూ వెళుతుండగా మరో వ్యక్తి సహాయంతో పట్టుకున్నారు. బైక్ దొంగను స్థానిక టూటౌన్ పోలీసులకు అప్పగించారు. ఎస్సై వి.జాస్మిన్ కేసు నమోదు చేశారు. దొంగను న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఆమె తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

గుడివాడ, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి) : గుడివాడ నియోజికవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగినట్టు సంఘం పెద్దలు తెలిపారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని శ్రీకృష్ణ మందిర ప్రాంగణంలో యాదవ సంఘం అధ్యక్షుడు డొక్కు రాంబాబు, సంఘం పెద్దలు ఆర్.వి.ఎల్ నరసింహారావు, వేడుకల కమిటీ సభ్యులు మాట్లాడుతూ కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా జరిగిన ఊరేగింపు వేలాది మందితో ఘనంగా జరిగిందని అన్నారు. ఊరేగింపులో పాల్గొన్న యాదవ సంఘీయులు, శ్రీకృష్ణ భక్తులు మాజీ మంత్రి కఠారి ఈశ్వర్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు లోయ రాజేష్, మెరుగుమాల సతీష్, గొరిపర్తి మురళీ, కొలుసు సతీష్, దిమ్మిటి హర్ష, కొలుసు శ్రీను, పెద్దిబోయిన వెంకటేశ్వరరావు, జోగా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

- రోడ్ల వెంబడి పడేస్తున్న చెత్తా, చెదారం
- చెత్తను కాల్చుతున్న వైనం

(ఆంధ్రజ్యోతి - నందివాడ): పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో సేకరించిన చెత్త సంపద కేంద్రాలకు చేరటానికి చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంపద కేంద్రాలు ఏ పంచాయతీలో చూసిన కిలోమీటర్‌పైనే దూరంలో ఉన్నాయి. మండలంలోని ఒక్క నందివాడ సంపద కేంద్రం తప్ప అన్ని పంచాయతీలలో సంపద కేంద్రాలు దూరంగానే ఉన్నాయి. ఆ సంపద కేంద్రాలకు పంచాయతీల ద్వారా సేకరించిన చెత్తను ఊరి బయటే కాల్చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలన్న నిబంధనలు ఉన్నా ఆ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. పంచాయతీ కార్మికులు చెత్త సేకరణ బిల్లు ద్వారా చెత్త సేకరించి సంపద కేంద్రాలకు వెళ్లలేక ఊరి బయట రోడ్డు పక్కన పడేస్తున్నారు. మండల స్థాయి అధికారులు సైతం గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్నారా? లేదా అని తనిఖీలు తప్ప ఆ చెత్త ఎక్కడ వేస్తున్నారో అన్న ఆలోచన కూడా చేయటం లేదు. రోడ్ల వెంబడి దుర్వాసన వచ్చినా అధికారులకు సంబంధం లేదు. ఇప్పటికైనా సదరు అధికారులు స్పందించి నందివాడ సంపద కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది చెత్తను సంపద కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని మండల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎలక్ట్రికల్ వాహనాలను ఏర్పాటు చేయాలి

ఎలక్ట్రిక్ వాహనాలు ఉంటే గ్రామాల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించటం సాధ్యమవుతుందన్నారు.

అమీర్ బాషా,
మండల పంచాయతీ విస్తరణ అధికారి


రుద్రపాకలో ఖాళీగా ఉన్న సంపద కేంద్రం

మచిలీపట్నం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505	



ఒక్కరోజు ఆదాయం రూ.9.74 లక్షలు

మోపిదేవి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. నాగ వల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఒక్క రోజులోనే వివిధ సేవా రుసుముల ద్వారా రూ.9,74,962 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం

● మంత్రి కొల్లు రవీంద్ర

మోపిదేవి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌ను సమర్థవంతంగా అమలు చేసి సూపర్ హిట్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి నూతన పట్టు వస్త్రాలతో ఆయనను సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు మంత్రికి అందించారు.

అనంతరం మంత్రి రవీంద్ర మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్త్రీ శక్తి పేరున ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం అమలు చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో 11,500 బస్సులు ఉండగా, 8500 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించటం జరిగిందన్నారు. ప్రతి రోజూ 25 లక్షల మంది వరకు మహిళలు బస్సుల్లో ప్రయాణిస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. రోజు 162 కోట్లు ప్రభుత్వానికి భారం పడుతుండగా, సంవత్సరానికి రూ.2000 కోట్లు వరకు భరించాల్సి వస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే సూపర్‌సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలెండర్, స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం వంటి అన్ని పథకాలను అమలు చేసి సూపర్ హిట్ చేయటం జరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.



మంత్రి రవీంద్రకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ

వేణుగోపాలస్వామికి పూజలు

మచిలీపట్నం టౌన్ : నగరంలోని వేణుగోపాల స్వామి ఆలయ మహత్యాన్ని భక్తులకు తెలియచేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.

శనివారం ఆయన నగరంలోని బొబ్బిలి వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు జరిపారు. మంత్రికి వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. మంత్రి రవీంద్రను ఈవో గోవాడ వెంకట కృష్ణారావు సత్కరించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోట మర్రి బాబాప్రసాద్, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు రైల్వేగేటు మూసివేత

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : చిలకలపూడి రైల్వేగేటును మూడు రోజుల పాటు తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఆర్. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే గేటుకు మరమ్మతులు నిర్వహించనున్న నేపథ్యంలో ఈనెల 18వ తేదీ సోమవారం ఉదయం నుంచి 20వ తేదీ సాయంత్రం వరకు గేటును మూసివేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాల్సిందిగా కోరారు.

కటకం ప్రసాద్‌కు జోగి రమేష్ పరామర్శ

పెడన, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చైర్‌పర్సన్ కటకం నాగకుమారి భర్త, సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్‌ను మాజీ మంత్రి జోగి రమేష్ ఆదివారం పరామర్శించారు. అనంతరం ఆయన పక్షవాతంతో బాధపడుతున్న షఫీ స్వీట్ షాపు యజమాని ఎండి రఫీని పరామర్శించారు.

పైడమ్మకు ప్రత్యేక పూజలు

పెడన, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం సందర్భంగా పైడమ్మ ఆలయంలో ఆశాది తోట రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అన్న సమారాధన నిర్వహించారు.



పాలకొల్లు వెళుతూ కృత్తివెన్నులో ఆగి ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేశ్

కృత్తివెన్నులో మంత్రి లోకేశ్

కృత్తివెన్ను ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె నిశ్చయతాంబూలాల వేడుకకు కృత్తివెన్ను మండలం మీదుగా రోడ్డు మార్గంలో పాలకొల్లు వెళ్లారు. ఈ సందర్భంగా కృత్తివెన్ను, గరిశపూడి, లక్ష్మీపురం, పల్లెపాలెం వంటి ప్రధాన సెంటర్లల్లో ప్రజలు లోకేశ్‌కు చేతులు ఊపుతూ అభివాదం చేశారు. లోకేశ్ కూడా ప్రజలకు తిరిగి అభివాదం చేస్తూ, నమస్కరించారు. గరిశపూడి, పల్లెపాలెం సెంటర్లల్లో ప్రజలు లోకేశ్ కాన్వాయ్‌ను ఆపగా, ఆయన కారులో నుంచి దిగి ప్రజలతో ముచ్చటించి, ఫోటోలు దిగి సందడి చేశారు.



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఉప సర్పంచ్ ముమ్మనేని నాని, వాసవీ క్లబ్ ప్రతినిధులు

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు

చల్లపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాలు జరిగాయి. ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని ఉపసర్పంచ్ ముమ్మనేని నాని ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ మోహనరావు 50 మందిని పరీక్షించి 17 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. హోమియో వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సమాజసేవలో ఆర్యవైశ్యులు ముందువరుసలో ఉంటారనీ, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు అభినందనీయమని ఉపసర్పంచ్ నాని తెలిపారు. క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, జూపూడి కిరణ్, గోళ్ల ద్రోణ, దింటకుర్తి జ్యోతి, అన్నం సత్యవాణి, తమ్మన సతీష్, వరదా హరిగోపాల్, మలిశెట్టి చెంచు రాములు తదితరులు పాల్గొన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షునిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉపసర్పంచ్ ముమ్మనేని నానిని వాసవీక్లబ్ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు.



మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న శీలం అశ్విన్‌కుమార్, తలశిల స్వర్ణలత తదితరులు

మండలి వెంకట కృష్ణారావుకు ఘననివాళి

నాగాయలంక, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : శత జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం 13వ రోజున మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అల్లుడు శీలం అశ్వినీ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, తలశిల స్వర్ణలత, తలశిల వెంకట నరసింహారావు, మండలి ఉదయభాస్కర్, అంబటి శ్యామ్ ప్రసాద్, తోట శ్రీనివాసరావు, బండ్రెడ్డి మల్లిఖార్జున్, బండ్రెడ్డి హరి, ఉప్పల ప్రసాద్, కర్రి కృష్ణమూర్తి, మాదివాడ అర్జునరావు, బండ్రెడ్డి బాలకృష్ణ, తాడేపల్లి వెంకట పాపారావు, షేక్ జానీ, బండ్రెడ్డి శ్రీను, తలశిల రామకృష్ణ చౌదరి, సబ్బినేని మహేష్, చిరివేళ్ల నాగరాజు, తానంకి చంటి తదితరులు పాల్గొన్నారు.



వేమూరి రామకృష్ణారావు, ఓరుగంటి వెంకటాచలం చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

వేమూరి రామకృష్ణారావు, వెంకటాచలం మృతికి బ్రాహ్మణ ప్రముఖుల సంతాపం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వేమూరి రామకృష్ణారావు, ఓరుగంటి యజ్ఞేశ్వర వెంకటాచలం మృతి తీరని లోటు అని పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పేర్కొన్నారు. వివేకానంద మందిరంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో రామ కృష్ణారావు, వెంకటాచలం సంతాప సభ నిర్వహించారు. బ్రాహ్మణులకు ఏ సమస్య వచ్చినా వేమూరి రామకృష్ణారావు, ఓగురంటి యజ్ఞేశ్వర వెంకటాచలం ముందుండేవారన్నారు. స్వర్గీయ మాజీ ప్రధాని పి.వి. నరసింహారావు కాంస్య విగ్రహ ఏర్పాటుకు రామకృష్ణారావు విశేష కృషి చేశారన్నారు. చినతుమ్మిడి సర్పంచ్ ఓరుగంటి యజ్ఞేశ్వర వెంకటాచలం సమాజసేవతో పాటు బ్రాహ్మణులకు విశేష సేవలందించారన్నారు. బ్రాహ్మణ సంఘ నాయకులు మోపర్తి సుబ్రహ్మణ్యం, పి.వి. ఫణికుమార్, వేమూరి నాగసాయిశర్మ, జమ్మలమడక సేతురామయ్య, బి.ఎస్.ఎన్. రాధాకృష్ణమూర్తి, వి.ఎస్.ఎస్.ఆర్. శర్మ, వాడపల్లి బాలాజీ సువర్ణకుమార్, జెఎస్ఆర్ మూర్తి, పిడుగు కృష్ణయ్య, కాశీపట్నం రఘు శర్మ, అంబటిపూడి నాగలక్ష్మి, సర్వా లలితకుమారి పాల్గొన్నారు.

సంగమూడిలో గ్రామదేవతలకు నైవేద్యాలు



కృత్తివెన్ను, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలో చివరి ఆదివారం గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో పూజించారు. సంగమూడి గ్రామంలో మారెమ్మ, గంగానమ్మ, పుంతలో ముసలమ్మలతో పాటు ఇతర గ్రామ దేవతలకు, పోతురాజు జాతర నిర్వహించి, నైవేద్యాలు అర్పించారు. అమ్మవారి ప్రతిరూపాలుగా భావించే ఘటాసారులు కనకడప్పులతో ఊరేగారు. అనంతరం అమ్మవార్లకు నైవేద్యాలను మొక్కుబడులుగా చెల్లించారు. జాతరను పురస్కరించుకొని బంధువులు, ఆడపడుచుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది.



చల్లపల్లి సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబును సత్కరిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ



కానూరు పీఏసీఎస్ చైర్మన్ గోపు ప్రతాప్ నరేష్‌కుమార్, సభ్యులు మహేష్‌బాబు, నాగరాజులను అభినందిస్తున్న గోపు సత్యనారాయణ

రైతులకు ఉత్తమ సేవలందించాలి

● పీఏసీఎస్ చైర్మన్ వీరబాబు అభినందన సభలో బండి రామకృష్ణ

చల్లపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : సొసైటీ చైర్మన్లు, పర్సన్‌లు రైతులకు ఉత్తమ సేవలందించాలని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. చల్లపల్లి సొసైటీ చైర్మన్‌గా బొందలపాటి వీరబాబు, పర్సన్‌లుగా వేముల హరికృష్ణ, ఆలూరి విశ్రాంతమ్మ ఇటీవల బాధ్యతలు స్వీకరించగా, అభినందన సభ ఆదివారం పడమరవీధిలోని కల్యాణమండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ వీరబాబును, విశ్రాంతమ్మను సన్మానించారు. సొసైటీ అధికారులు, ఉద్యోగుల సహకారంతో త్రిసభ్య కమిటీ ఆదర్శవంతంగా పనిచేయాలని కోరారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, యువనేత మండలి వెంకట్రామ్, చల్లపల్లి ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్‌లు పైడిపాముల కృష్ణకుమారి, కొల్లూరు కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పైడిపాముల స్వప్న, సిద్ధినేని కుమార్‌రాజా, జనసేన నేతలు చోడగం విమల్ కృష్ణ, అడపా రాంబాబు, నూకల లక్ష్మయ్య, పూషడపు రత్న గోపాల్, పసుపులేటి రవికుమార్, అడపా రవి, కూటమి నేతలు బోలెం నాగమణి, యాసం చిట్టిబాబు, రావి రాజేశ్వరరావు, మోర్ల శివ, పిడికిటి తాండవకృష్ణ, సీఈవో తోట కృష్ణారావు, మెరకనపల్లి సొసైటీ చైర్‌పర్సన్ యర్రంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. బొందలపాటి వీరబాబును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కానూరు పీఏసీఎస్ పాలకవర్గానికి గోపు సత్యనారాయణ అభినందన

మచిలీపట్నం టౌన్ : బందరు మండలం కానూరు పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం జరిగింది. చైర్మన్‌గా గోపు ప్రతాప్ నరేష్‌కుమార్, సభ్యులుగా దివి మహేష్‌బాబు, చక్కా నాగరాజు ప్రమాణస్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. రైతులు దేశానికి వెన్నెముక అన్నారు. రైతులకు సేవచేసే భాగ్యం పీఏసీఎస్‌ల ద్వారా లభించడం కార్యవర్గ అదృష్టమన్నారు. శిథిలావస్థకు చేరిన బ్యాంకు నూతన భవన నిర్మాణానికి తన వంతు కృషి చేస్తానన్నారు. గోపు ప్రతాప్ నరేష్‌కుమార్ మాట్లాడుతూ, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కూటమి నాయకులు, రైతులు, కార్యకర్తలు, పీఏసీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళం



డాక్టర్ డీఆర్కే చెక్కు డాక్టర్ నాగరాణి

చల్లపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛసుందర చల్లపల్లి సాధనలో భాగంగా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్న మన కోసం మనం ట్రస్ట్‌కు ప్రముఖ వైద్యురాలు డాక్టర్ నాగరాణి రూ.20 వేల విరాళం అందజేశారు. గుంటూరు వైద్యకళాశాల పూర్వ విద్యార్థుల బృందంలో డాక్టర్ నాగరాణి చల్లపల్లిని సందర్శించారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ డీఆర్కే ప్రసాద్‌కు విరాళం చెక్కును అందజేశారు. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి నిమిత్తం ట్రస్ట్‌కు స్థానిక గౌడపాలెంకు చెందిన మురారి శివశంకర్ కుమారుడు సాత్విక్ రూ.10 వేల విరాళాన్ని డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులకు గౌడపెద్దలు వేముల అర్జునరావు, నాగశ్రీనివాసరావు ద్వారా అందజేశారు.

వేకనూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు పద్మనాభం మృతి



పద్మనాభం (ఫైల్)

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : వేకనూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు నామన పద్మనాభం (65) ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పద్మనాభం భౌతి కకాయాన్ని గ్రామానికి చెందిన పలువురు నేతలు సందర్శించి నివాళులర్పించారు.





పాలకాయితిప్పలో సీతారాములు, ధ్వజస్తంభ ప్రతిష్ఠలో భక్తజనం



వేకనూరులో స్వామివారి ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న భక్తులు

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

కోడూరు, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : పాలకాయితిప్పలో నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి దేవాలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా జరిగింది. సీతారామ, లక్ష్మణ, హనుమ విగ్రహాలు, ధ్వజ, బలిపీఠ, శిఖర ప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య అత్యంత వేడుకగా జరిగింది. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వనియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, తూర్పుకృష్ణా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రతిష్ఠా పూజల్లో పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ వారు పర్యవేక్షించగా, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు

సూర్యనారాయణస్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, : వేకనూరులో సూర్యనారాయణస్వామికి ఆదివారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో ఆలపాటి ఉదయ భాస్కర్‌రావు - శశి నాగ విజయ సావిత్రిదేవి వైభవంగా కల్యాణం జరిపారు. అనంతరం గుడిసె బాలకృష్ణ - చైతన్య భ్రమరాంబిక (హైదరాబాద్) ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు పర్యవేక్షించారు.

పసుపు కొమ్ముల అర్చన రేపు

నాగాయలంక : నాగాయలంకలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామికి శ్రావణ మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా 108 కిలోల పసుపు కొమ్ములతో విశేష అర్చన నిర్వహిస్తారు. ప్రదోష కాలం 6 గంటల నుంచి భక్తులు స్వయంగా స్వహస్తాలతో పసుపు కొమ్ములు తీసుకొచ్చి పూజ ల్లో పాల్గొనాలని ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

భాస్కరపురంలో బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి) : బందరు నగరంలో వీధికుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ దాడి చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ వాహనదారులు, పాదచారులపైకి వచ్చి కరుస్తున్నాయి. భాస్కరపురం త్రిశక్తి పీఠం రోడ్డులో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ పిల్లలను కరిచిన సంఘటనలు ఉన్నాయి. వీధి కుక్కలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 17(ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ ఆర్టీసీ కార్గోలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేసిన లోకేశ్ ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లోకేశ్ శనివారం వివాహ దినోత్సవం జరుపుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. చిలకలపూడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.